భార్య పుట్టిన రోజును మర్చిపోతే ఐదేండ్ల జైలు

న్యూఢిల్లీ: కుటుంబ బాధ్యతల్లో తల మునకలయ్యే భర్త తన భార్య పుట్టిన రోజును మర్చిపోవడం, ఆమె ఆయనపై చిర్రుబుర్రులాడటం తరచూ కనిపిస్తూ ఉంటుంది. అయితే సమోవా దేశంలో మాత్రం ఇలాంటి భర్తలకు జైలు శిక్ష తప్పదు. ఈ దేశంలో అమల్లో ఉన్న చట్టం ప్రకారం, భార్య పుట్టిన రోజును మొదటిసారి మర్చిపోయే భర్తను హెచ్చరిస్తారు. రెండోసారి కూడా మర్చిపోతే ఆ భర్తకు జరిమానా లేదా గరిష్ఠంగా ఐదేండ్ల జైలు శిక్ష విధిస్తారు. ఇలాంటి భర్తలను గుర్తించేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. ఈ చట్టం గురించి మహిళలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నగరాల్లో సరుకు రవాణాకు యాప్

న్యూఢిల్లీ, నవంబర్ 13: మధ్యవర్తులతో పనిలేకుండా, సరుకు రవాణా చేసే వాహనం డ్రైవర్‌తో నేరుగా మాట్లాడుకునే విధంగా సరికొత్త యాప్‌ను ఐఐటీ-మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. 'ఆఫ్ట్ రూట్' అనే యాప్ ద్వారా వినియోగదారుడు ఎలాంటి కమీషన్లు చెల్లించకుండానే, డ్రైవర్‌తో నేరుగా మాట్లాడుకొని సరుకు రవాణా సేవల్ని పొందేందుకు అవకాశముంది. 'సరుకు రవాణాలో ఇప్పుడున్న వ్యవస్థ అసంఘటితంగా ఉంది. ఆర్డర్ డెలివరీ అయిన తర్వాత వాహనం ఖాళీగా తిరుగు ప్రయాణం కావటం డ్రైవర్లు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య. అలాగే ప్యాకింగ్, వాహనం లోపలి ప్రదేశాన్ని సద్వినియోగం చేసుకునే పద్ధతుల్ని కూడా తెలియజేస్తాం' అని ఆఫ్ట్ రూట్ లాజిస్టిక్స్ సహ వ్యవస్థాపకుడు ఎన్ ఎస్ నారాయణ స్వామి చెప్పారు. ఏడాది చివరినాటికి యాప్ సేవల్ని 500కిపైగా నగరాల్లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని ప్రొఫెసర్ అనుజ్ ఫౌలియా చెప్పారు.

మైతీ తీవ్రవాద సంస్థలపై నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న 9 మైతీ తీవ్రవాద సంస్థలు, వాటి అనుబంధ సంస్థలపై విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం సోమవారం పొడిగించింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు, భద్రతా దళాలపై దాడులకు పాల్పడుతున్నందుకు ఈ సంస్థలను మరో ఐదేండ్ల పాటు నిషేధిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. మైతీ తీవ్రవాద సంస్థలను కట్టడి చేయకపోతే, వేర్పాటువాద, ఉగ్రవాద, హింసాత్మక కార్యకలాపాలను పెంచుతాయని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది.

మహువాకు తృణమూల్ కొత్త బాధ్యతలు

కోల్‌కతా: లోక్‌సభలో ప్రశ్నలు అడిగించేందుకు ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలతో లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయే ప్రమాదంలో ఉన్న ఎంపీ మహువా మొయిత్రాకు టీఎంసీ గట్టి మద్దతుగా నిలిచింది. పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణ నగర్ జిల్లాలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతను ఆమెకు అప్పగించింది. రానున్న లోక్ సభ ఎన్నికల కోసం రాష్ట్రంలోని 35 ఆర్గనైజేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రెసిడెంట్ల పేర్లను సోమవారం ప్రకటించింది. మహువా గతంలో ఈ జిల్లా అధ్యక్ష పదవిని కొంత కాలం నిర్వహించారు. తాజాగా ఆమెను ఆ పదవిలో పునరుద్ధరించారు. దీంతో ఆమె పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి, టీఎంసీకి ధన్యవాదాలు తెలిపారు. మహువాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని ఎథిక్స్ కమిటీ ఇటీవల సిఫారసు చేసిన సంగతి తెలిసిందే.

అమెరికాలో వ్యాపిస్తున్న హెచ్‌వి.1 వేరియంట్

న్యూఢిల్లీ, నవంబర్ 13: అమెరికాలో కరోనా కొత్త వేరియంట్ హెచ్‌వి.1 వేగంగా వ్యాపిస్తున్నది. ఈజీ.5(ఎరిస్) లాంటి ఇతర రకాల కంటే దీని ప్రభావం ఎక్కువగా ఉన్నది. ఒమిక్రాన్ వేరియంట్ నుంచే ఇది పుట్టిందని వైద్యాధికారులు తెలిపారు. అక్టోబర్‌లో దేశవ్యాప్తంగా నమోదైన కొవిడ్-19 కేసుల్లో పావు భాగానికి పైగా హెచ్‌వి.1 కేసులే ఉన్నాయి. గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ, దగ్గు, తలనొప్పి, వికారం, కండరాల నొప్పులు ఈ వేరియంట్ లక్షణాలని వైద్యులు తెలిపారు. అయితే మిగతా వేరియంట్లతో పోలిస్తే ఈ వేరియంట్ అంత ప్రమాదకరం కాదని శాస్త్రవేత్తలు చెప్పారు.

తలసిరే అసలైన వృద్ధి

తలసరి ఆదాయం ఆధారంగా జీడీపీని లెక్కించాలి

- అదే అసలైన అభివృద్ధికి సరైన సూచిక అవుతుంది
- అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని గుడ్డి సంబురాలొద్దు
- దేశ జీడీపీపై భారత్‌పే మాజీ సీఈవో గ్రోవర్ వ్యాఖ్యలు
- తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం

న్యూఢిల్లీ, నవంబర్ 13: భారత్‌లో స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ) లెక్కింపు విధానంపై ప్రముఖ ఆంత్రప్రెన్యూర్, భారత్‌పే మాజీ సీఈవో అశ్నీర్ గ్రోవర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశంలో జీడీపీని లెక్కిస్తున్న తీరును ఆయన వ్యతిరేకించారు. తలసరి ఆదాయం ఆధారంగా జీడీపీని లెక్కించాల్సిన అవసరం ఉన్నదని, అదే అభివృద్ధికి అసలైన సూచిక అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన ఓ నెటిజన్ పోస్టుకు స్పందనగా తాజాగా తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రపంచ దేశాల కర్బన ఉద్గారాల్లో చైనా అతి పెద్ద కాలుష్యకారిగా ఉన్నదని, అమెరికా కంటే ముందు వరుసలో ఉన్నదంటూ వచ్చిన ఓ నివేదికపై మోహన్‌పాయ్ అనే నెటిజన్ స్పందించారు. కర్బన ఉద్గారాల అంశాన్ని జనాభా పరంగా చూడాల్సిన అవసరం ఉన్నదని, చైనా జనాభా అమెరికా కంటే నాలుగు రెట్లు అని, అమెరికా తలసరి కర్బన ఉద్గారం చైనాలో 45 శాతం మాత్రమే ఉన్నదని అతను తన పోస్టులో పేర్కొన్నారు. దీనిపై అశ్నీర్ గ్రోవర్ స్పందిస్తూ.. 'కచ్చితంగా ఇది సరైనది. సరైన పారామీటర్లను ట్రాక్ చేయడం చాలా కీలకం. అదేవిధంగా, మన భారతదేశ జీడీపీని కూడా తలసరి ఆదాయం పరంగా చూడాల్సిన అవసరం ఉన్నది. ప్రపంచంలో 3వ లేదా 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామని గుడ్డిగా సంబురాలు జరుపుకోవడం కాదు.. తలసరి ఆదాయానికి సంబంధించిన చార్టుల్లో పైకి ఎగబాకడమే అభివృద్ధికి సరైన సూచిక, సరైన గణన అవుతుంది' అని తన పోస్టులో రాశారు.

గ్రోవర్‌తో ఏకీభవించిన నెటిజన్లు

జీడీపీ అంశంపై అశ్నీర్ గ్రోవర్ ఎక్స్ పోస్టుపై నెటిజన్లు మిశ్రమ స్పందనలు ఇచ్చారు. చాలా మంది గ్రోవర్ అభిప్రాయంతో ఏకీభవించారు. ప్రభుత్వాలు ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. చాలా మంది గ్రోవర్ పోస్టును తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశారు. ఆయన పోస్టుకు ఏకంగా నాలుగు లక్షల వ్యూస్‌లు, 5 వేలకు పైగా లైక్‌లు వచ్చాయి. గ్రోవర్ అభిప్రాయంపై ఓ నెటిజన్ స్పందిస్తూ 'అవును.. జీడీపీ పరంగా నేడు భారత్ 5వ ర్యాంకులో ఉన్నది. అది మనల్ని గర్వపడేలా చేయొచ్చు. కానీ తలసరి ఆదాయం పరంగా చూస్తే మన దేశ ర్యాంకు 128గా ఉన్నది' అని పేర్కొన్నారు. మెరుగైన తలసరి ఆదాయం, పౌరులకు ఆరోగ్యం, నాణ్యమైన జీవన ప్రమాణాలు, మానసిక క్షేమం, సంతోషం వంటివి లేకుండా.. జీడీపీలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ వ్యర్థమేనని మరో యూజర్ అభిప్రాయపడ్డారు. 'మనం లెక్కించాల్సింది తలసరి ఆదాయాన్ని.. జీడీపీని కాదు. తలసరి ఆదాయమే కుటుంబ ఆదాయ పెరుగుదలను సూచిస్తుంది' అని మరొకరు పేర్కొన్నారు. కొంత మంది నెటిజర్లు గ్రోవర్ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు.



తలసరి ఆదాయంలో అగ్రభాగాన తెలంగాణ

తలసరి ఆదాయం విషయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2014-15లో రూ.1,24,104గా ఉన్న తలసరి ఆదాయం అనంతర కాలంలో సీఎం కేసీఆర్ పాలనలో 2022-23 నాటికి ఏకంగా రూ.3,08,732కి ఎగబాకింది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నది. తొమ్మిదేండ్లలో అనూహ్య వృద్ధి సాధించిన కొత్త రాష్ట్రం తెలంగాణ.. జీఎస్‌డీపీలో మూడు రెట్లు వృద్ధి సాధించింది. తలసరి ఆదాయంలోనూ నంబర్ వన్‌గా నిలిచింది. తెలంగాణ ఏర్పడే నాటికి 2014-15లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,24,104. అప్పటికి తెలంగాణ స్థానం 10. కానీ అనతికాలంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ఇతర పెద్ద రాష్ట్రాలను వెనక్కి నెట్టి 2022-23 నాటికి రూ.3,08,732తో అగ్రస్థానానికి ఎగబాకింది. తలసరి ఆదాయం విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత చాలా రాష్ట్రాలు తెలంగాణ కంటే వెనుకబడి ఉన్నాయి.

తెలంగాణ ప్రగతి ఇలా..

సంవత్సరం	తలసరి ఆదాయం (రూ.లక్షల్లో)
2014-15	1,24,104
2017-18	1,79,358
2018-19	2,09,848
2019-20	2,31,326
2020-21	2,25,687
2021-22	2,65,942
2022-23	3,08,732

బ్రేవర్మన్‌పై వేటు

- మంత్రి పదవి నుంచి తొలగించిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్
- విదేశాంగ మంత్రిగా మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్ నియామకం
- మంత్రి వర్గంలో కీలక మార్పులు

లండన్, నవంబర్ 13: బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సోమవారం తన క్యాబినెట్‌లో పలు కీలక మార్పులు చేపట్టారు. భారత మూలాలున్న హోంశాఖ మంత్రి సుయెల్లా బ్రేవర్మన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించి, ఆమె స్థానంలో జేమ్స్ క్లెవర్లీని నియమించారు. మరోవైపు మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్‌ను అనూహ్యంగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఆయనకు విదేశాంగ శాఖను అప్పగించారు. ఇటీవల డౌనింగ్ స్ట్రీట్ అనుమతి లేకుండా సుయెల్లా ది టైమ్స్ పత్రికలో రాసిన ఓ కథనం వివాదాస్పదం అయింది. లండన్‌లో ఇజ్రాయెల్-గాజా ఆందోళనలను నియంత్రించడంలో నగర పోలీసులు విఫలమయ్యారని, ఇష్టమైన వారిని ప్రోత్సహించారని అందులో ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని స్వపక్షంతో పాటు విపక్షాల నుంచి కూడా డిమాండ్లు వచ్చాయి. మంత్రి పదవి తొలగింపుపై సుయెల్లా స్పందిస్తూ 'హోంమంత్రిగా పని చేయడం నా జీవితకాల అదృష్టం. నేను తగిన సమయంలో మరిన్ని చెప్తాను' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, కామెరాన్ గతంలో ఈయూలోనే యూకే కొనసాగాలని ప్రచారం చేశారు. బ్రెగ్జిట్ రెఫరెండంలో ఓడిపోవడంతో ఆయన 2016లో ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

ఐఐఎంల స్వతంత్రతకు చెల్లు!

- కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు
- రాష్ట్రపతికి విశేష అధికారాల కల్పన

న్యూఢిల్లీ, నవంబర్ 13: దేశంలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ల స్వతంత్రతను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఐఐఎంలపై రాష్ట్రపతికి విశేషాధికారాలు కల్పించింది. నూతన నిబంధనల ప్రకారం.. దేశంలోని అన్ని ఐఐఎంలకు రాష్ట్రపతి 'విజిటర్'గా ఉంటారు. బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్, డైరెక్టర్ల నియామకం లేదా తొలగింపుపై రాష్ట్రపతికి అధికారం ఉంటుంది. అదేవిధంగా చట్ట ప్రకారం 'విజిటర్' ఆదేశాలను పాటించడం లేదని భావిస్తే.. సమర్థంగా విధులు నిర్వహించడం లేదని అనిపిస్తే బోర్డును రద్దు చేసేందుకు కూడా రాష్ట్రపతికి అధికారాలు కల్పించారు. కొత్త డైరెక్టర్ల నియామకానికి సంబంధించి సెర్చ్ ప్యానెళ్ల నియామకం, పాలసీ నిర్ణయాలు, వార్షిక బడ్జెట్ల ఆమోదం, ఫీజుల నిర్ణయం వంటి అంశాలపై కూడా రాష్ట్రపతికి అధికారం ఉంటుంది. అంతకుముందు ఈ బోర్డు రద్దు క్లాజ్ ఉండేది కాదు. డైరెక్టర్ల నియామకంలో బోర్డుకే పూర్తి బాధ్యత, అధికారం ఉండేది. ఐఐఎం రూల్స్-2018ని సవరిస్తూ తీసుకొచ్చిన ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(సవరణ) రూల్స్-2023 బిల్లుకు జూలైలో పార్లమెంట్ ఆమోదం తెలిపింది.

ఆర్థిక నేరగాళ్ల చేతులకు బేడీలు వేయొద్దు

- పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, నవంబర్ 13: కస్టడీలోకి తీసుకున్న ఆర్థిక నేరగాళ్ల చేతులకు బేడీలు వేయొద్దని.. రేప్, హత్య లాంటి క్రూరమైన నేరాలకు పాల్పడిన వారితో కలిపి ఉంచొద్దని పార్లమెంటరీ కమిటీ ఈ నెల 3న సిఫారసు చేసింది. ఆర్థిక నేరాల్లో చిన్నవి మొదలుకొని తీవ్రమైనవి కూడా ఉంటాయని.. ఈ నేపథ్యంలో ఈ విభాగంలోని అన్ని కేసుల్లో నిందితులకు బేడీలు వేయడం సరికాదని.. క్లాజ్ 43(3)లోని 'ఆర్థిక నేరాలు' పదాన్ని తొలగించాలని కమిటీ సిఫారసు చేసింది.

ట్రాకింగ్ పరికరాలతో పెరోల్ ఖైదీలపై నిఘా!

న్యూఢిల్లీ: పెరోల్‌పై విడుదలైన ఖైదీలపై ట్రాకింగ్ పరికరాలతో నిఘా ఉంచాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. కరడు గట్టిన నేరగాళ్లను ఇతర ఖైదీలతో వేరు చేసి ప్రత్యేక సెల్‌లో ఉంచాలని సలహా ఇచ్చింది. మే నెలలోనే విడుదలైన ఈ మార్గదర్శకాలు సోమవారం హోంశాఖ వెబ్‌సైట్‌లో ప్రచురించారు. 'ట్రాకింగ్ పరికరాలను ఉపయోగించి పెరోల్‌పై వెళ్లే ఖైదీలపై నిఘా ఉంచొచ్చు. వారు నిబంధనలను అతిక్రమిస్తే పెరోల్‌ను రద్దు చేయవచ్చు' అని హోంశాఖ తెలిపింది.

ఇద్దరు తెలంగాణ హైకోర్టు జడ్జీల బదిలీ

- మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ సుధీర్ కుమార్
- కర్ణాటక హైకోర్టుకు జస్టిస్ సుమలత ట్రాన్స్‌ఫర్

జస్టిస్ సుధీర్‌కుమార్

జస్టిస్ నీ సుమలత

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నీ సుమలత, జస్టిస్ ఎం సుధీర్ కుమార్ బదిలీ అయ్యారు. జస్టిస్ సుధీర్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ సుమలతను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్ర న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 10న వీరి బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేయగా, ఇందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా ఆమోదం తెలిపారు. వీరితోపాటు వివిధ హైకోర్టులకు చెందిన మరో ముగ్గురిని కూడా బదిలీ చేశారు.

సిద్ధరామయ్యకు రూ.1.9 కోట్ల మంచం

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి బహుమతుల వివాదంలో చిక్కుకున్నారు. ఆయన గత పదవీకాలంలో ఖరీదైన హుబ్లాట్ వాచ్‌ని బహుమతిగా స్వీకరించారని ఆరోపణలు వచ్చాయి. తాజాగా ఆయన మరో బహుమతిని స్వీకరించారని జేడీఎస్ కర్ణాటక విభాగం అధ్యక్షుడు హెచ్‌డీ కుమార స్వామి ఆదివారం ఆరోపించారు. ఓ మంత్రి తన మద్దతుదారుల ద్వారా సిద్ధరామయ్యకు రూ.1.9 కోట్ల విలువైన మంచం, రెండు జతల సోఫా సెట్స్ బహుమతిగా ఇచ్చారన్నారు. ఇది హుబ్లాట్ వాచ్ వివాదానికి అప్‌డేటెడ్ వెర్షన్ అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితిని ఎదుర్కొనడానికి బదులుగా మంత్రుల బంగళాల ఆధునికీకరణ, కొత్త కార్ల కొనుగోలు కోసం ప్రజాధనాన్ని ప్రభుత్వం ఖర్చు పెడుతున్నదన్నారు. సీఎం నివాసంలో ఉన్న సమావేశ మందిరాన్ని ఆధునికీకరించేందుకు రూ.3 కోట్లు ఖర్చు చేయబోతున్నదని చెప్పారు.

బెంగాల్‌లో టీఎంసీ నేత హత్య

జాయ్‌నగర్ (పశ్చిమబెంగాల్), నవంబర్ 13: పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు చెందిన నాయకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సోమవారం దక్షిణ 24 పరగణాల జిల్లాలో చోటుచేసుకున్నది. జాయ్‌నగర్ పరిధిలోని బామున్‌గాచ్చి ప్రాంత అధ్యక్షుడు సైఫొద్దీన్ లష్కర్ ప్రార్థనల కోసం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. ఇదే అదునుగా భావించిన కొందరు దుండగులు చాలా దగ్గర నుంచి కాల్చి చంపారు. సైఫొద్దీన్ మద్దతుదారులు కాల్పులకు తెగబడ్డ వారిలో ఇద్దరిని పట్టుకొని ఒకడిని కొట్టి చంపారు. అప్పటికే అక్కడికి చేరుకొన్న పోలీసులు మరొకడిని కాపాడి అరెస్టు చేశారు. కాల్పులకు సీపీఎం నాయకులే కారణమని టీఎంసీ నేతలు ఆరోపించారు.



యెడియూరప్ప కుమారుడికి అసంతృప్తి సెగ

బెంగళూరు, నవంబర్ 13: కర్ణాటక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ సీఎం యెడియూరప్ప కుమారుడు విజయేంద్రను నియమించడంతో అసంతృప్తి రగిలింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తిని పార్టీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారంటూ సీనియర్ నేతలు నిలదీస్తున్నారు. ఎన్నో ఏండ్ల నుంచి పార్టీ కోసం పనిచేసిన తమను పట్టించుకోకుండా విజయేంద్రను అధ్యక్షుడిగా నియమించారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన యెడియూరప్ప అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నం చేస్తున్నారు.

వృద్ధ నేతలపైనే భారం!

- '75 ఏండ్ల' రూల్‌కు బీజేపీ బ్రేక్
- మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 70 ఏండ్లు పైబడిన వారికి టికెట్లు
- 80 ఏండ్లున్న నాయకుడికీ చాన్స్
- గత ఎన్నికల అనుభవాలతో బీజేపీలో ఓటమి భయం

భోపాల్, నవంబర్ 13: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి భయం పట్టుకొన్నది. ఎలాగైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇందులో భాగంగా 75 ఏండ్లు దాటిన వారిని ఎన్నికల రాజకీయాల పక్కకు పెట్టాలనే విధానం తీసుకొన్నామని చెప్పే కమలం పార్టీ.. ఇప్పుడు మధ్యప్రదేశ్ ఎన్నికల్లో గెలిచేందుకు అదే సీనియర్లైన వృద్ధ నేతలపై ఆధారపడుతున్నది. జగదీశ్ శెట్టర్, కేఎస్ ఈశ్వరప్ప వంటి పలువురు సీనియర్లకు టికెట్ నిరాకరించడంలో ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యప్రదేశ్‌లో '75 ఏండ్ల' రూల్‌ను బ్రేక్ చేసింది. 70 ఏండ్లు పైబడిన 14 మంది నేతలకు అసెంబ్లీ టికెట్లు ఇచ్చింది. అందులో ఒక అభ్యర్థి వయసైతే 80 ఏండ్లు.

పోటీకి అనాసక్తి చూపినా..

సత్నా జిల్లా నాగోడ్ స్థానం నుంచి రాష్ట్ర మాజీ మంత్రి నాగేంద్ర సింగ్ నాగోడ్(80)ని బీజేపీ బరిలోకి దింపింది. రేవా జిల్లా గూఢ్ నుంచి నాగేంద్ర సింగ్(79)ని పోటీచేయిస్తున్నది. గూఢ్‌లో పోటీ ఆసక్తికరంగా ఉన్నది. 79 ఏండ్ల నాగేంద్రసింగ్‌తో 25 ఏండ్ల ఆప్ అభ్యర్థి ప్రతాప్‌సింగ్ తలపడుతున్నారు. వాస్తవానికి నాగేంద్రసింగ్ నాగోడ్, నాగేంద్ర సింగ్ ఇద్దరూ వచ్చే ఎన్నికల్లో పోటీచేయబోమని ఐదు నెలల కిందటే ప్రకటించారు. అయినప్పటికీ వారిని బీజేపీ అధిష్ఠానం బరిలోకి దించింది. బీజేపీ నుంచి పోటీచేస్తున్న సీనియర్ నాయకుల్లో జయంత్ మలైయా(76), జగన్నాథ్ సింగ్(75), సీతాశరణ్ శర్మ(73), బిషాహూలాల్ సింగ్(73), మాయా సింగ్(73), హిజారిలాల్ దంగి(72) తదితరులు ఉన్నారు. 2016లో సర్తాజ్ సింగ్‌ను(అప్పుడు 76 ఏండ్లు) వయసు పేరుతో శివరాజ్ సింగ్ చౌహాన్ క్యాబినెట్ నుంచి తప్పించారు. ఆయనకు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టికెట్ నిరాకరించారు.

కాంగ్రెస్‌లోనూ వెటరన్స్

కాంగ్రెస్ కూడా 70 ఏండ్లు పైబడిన తొమ్మిది మంది నేతలకు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చింది. వీరిలో అత్యధిక వయస్కుడు 77 ఏండ్ల నరేంద్ర నహతను నీముచ్ జిల్లా మనస నియోజకవర్గం నుంచి బరిలో దింపింది. ఈ లిస్టులో మాజీ సీఎం కమల్‌నాథ్ కూడా ఉన్నారు. 76 ఏండ్ల కమల్‌నాథ్ చింద్వారా నుంచి పోటీచేస్తున్నారు.

వయో పరిమితిపై యూటర్న్

మధ్యప్రదేశ్‌లో 75 ఏండ్ల దాటిన సీనియర్లకు కూడా టికెట్లు ఇవ్వడం పార్టీ నేతలను ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా గత లోక్‌సభ ఎన్నికలకు ముందు అమిత్‌షా చేసిన ప్రకటనను గుర్తుచేసుకొంటున్నారు. 75 ఏండ్లు దాటిన వారికి టికెట్టు ఇవ్వకూడదని పార్టీ నిర్ణయం తీసుకొన్నదని 2019, ఏప్రిల్‌లో అప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్‌షా ప్రకటించారు. దీని కారణంగా బీజేపీలో సీనియర్ నేతలైన ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి వారికి 2019 సార్వత్రిక ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదు.

కుటుంబాల్లో పొలిటికల్ వార్

జైపూర్: బంధుత్వాలు వేరు.. రాజకీయాలు వేరంటున్నారు రాజస్థాన్ రాజకీయ నాయకులు.శాసన సభ ఎన్నికల్లో నాలుగుచోట్ల దగ్గరి బంధువులతోనే పోటీ పడుతున్నారు. రామ్‌ఘర్ సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర చౌదరికి పోటీగా జన్నాయక్ జనతా పార్టీ తరపున ఆయన భార్య రీటా చౌదరి బరిలో నిలిచారు. ధోల్‌పుర్ స్థానంలో బీజేపీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన శోభారాణి కుష్వా కాంగ్రెస్ పార్టీ తరపున, ఆమె బావ శివ్‌చరణ్ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. నాగ్‌పూర్‌లో మాజీ ఎంపీ జ్యోతి మిర్ధా బీజేపీ నుంచి, ఆమె మామ హరేంద్ర మిర్ధా కాంగ్రెస్ నుంచి పోటీ పడుతున్నారు. ఖేత్రీ స్థానంలో మనీషా గుర్జర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ తరపున బరిలోకి దిగిన సొంత బాబాయిపై పోటీ చేస్తున్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ఇవ్వండి: ఈసీ

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి 2023 సెప్టెంబర్ 30 వరకు ఎన్నికల బాండ్ల ద్వారా సేకరించిన విరాళాల వివరాల్ని ఈ నెల 15లోపు తమకు సమర్పించాలని ఆయా రాజకీయ పార్టీలను ఈసీ కోరింది. ఎన్నికల బాండ్ల విరాళాలపై తాజా సమాచారంతో తమ ముందుకు రావాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా వివరాల్ని కోరుతూ ఆయా రాజకీయ పార్టీలకు ఈసీ లేఖలు రాసింది.

అమెరికావైపే మొగ్గు

- విదేశీ విద్యకు యూఎస్ బాట పడుతున్న భారత విద్యార్థులు
- 35 శాతం పెరిగిన ప్రవేశాలు
- ఓపెన్ డోర్స్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ)//న్యూఢిల్లీ: ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్తున్న భారతీయుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. 2022-23లో మొత్తం 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికాలో అడుగుపెట్టారని, కిందటి ఏడాదితో పోల్చుకుంటే విద్యార్థుల సంఖ్య 35 శాతం పెరిగిందని 'ఓపెన్ డోర్స్' నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం అమెరికాలోని విద్యా సంస్థల్లో దాదాపు 10లక్షల మందికిపైగా అంతర్జాతీయ విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతున్నారు. ఇందులో భారతీయ విద్యార్థుల సంఖ్య దాదాపు 25శాతానికి చేరుకుంది. అమెరికాలో విద్యా అవకాశాలు, సమగ్రమైన, కచ్చితమైన, తాజా సమాచారం కోసం ఆ దేశ విదేశాంగ శాఖ 6 ఉచిత సలహా కేంద్రాల్ని భారత్‌లో ఏర్పాటుచేసింది. ఇందులో రెండు కేంద్రాలు హైదరాబాద్‌లో ఉండటం గమనార్హం. 'ఓపెన్ డోర్స్ రిపోర్ట్ డాటా' ప్రకారం, ఈ సారి గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్‌లో 1.65 లక్షల మందితో 62.6 శాతం పెరుగుదల నమోదైంది. గత ఏడాదితో పోల్చుకుంటే సుమారు 64 వేలమంది అధికంగా అమెరికాకు వెళ్లారు. అలాగే, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల్లో 16 శాతం పెరుగుదల నమోదైంది. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)కు అవకాశం కల్పించే కోర్సుల్లో భారత్ నుంచి 69 వేల మంది అడ్మిషన్లు పొందారు.


అమెరికాకు భారతీయ విద్యార్థుల క్యూ..
2021-22
2022-23
35% యూఎస్‌లో భారత విద్యార